www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 24 | జూన్ | 2025 పేజీలు : 8

## అమీర్ మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు



-సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

2 లో

# కౌలు రైతు కష్టాలు..!

- మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన కాంగ్రెస్
- రైతు భరోసాలో గుర్తించని ప్రభుత్వం
- ఆరుగాలం శ్రమించినా దక్కని ఫలితం
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతన్నల వేడుకోలు





**ప్రజాపక్షం/పినపాకః** కౌలు రైతుల పరిస్థితి అగోమ్యగోచరంగా తయారైంది. ఆరుగాలం శ్రమించినా చివరికి కన్నీరే మిగులుతోంది. భూమినే నమ్ముకున్న కష్టజీవికి తనకు గుంట భూమి లేకపోయినా వ్యవసాయంపై మమకారంతో భూమిని కౌలు తీసుకుని సేద్యం చేసే కౌలు రైతులకు ఆసరా కరువవుతుంది. ప్రభుత్వాలు అందించే సబ్సిడీ దరిచేరకపోవడం.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతుభరోసా పథకాన్ని కూడా భూమి యజమానులకే అందిస్తుండడంతో కౌలు రైతన్నల

మిగతా 2లో..

## ఇందిరమ్మ ఇండ్ల కోసం
# రోడ్డెక్కిన నిరుపేదలు

### వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై రాస్తారోకో



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే సొంతగూడు ఏర్పడుతుందని భావించిన నిరుపేదలకు నిరాశే మిగిలిందని, అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్, సిపిఎం పార్టీల ఆధ్వర్యంలో నిరుపేదలు రోడ్డెక్కి నిరసన తెలిపారు. సోమవారం వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై రాస్తారోకో

మిగతా 2లో..

## సీజనల్ వ్యాధుల
# నియంత్రణకు చర్యలు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్లు డా॥ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి సీజనల్ వ్యాధుల నియంత్రణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ బి. కళావతి బాయి వివరించారు.ఈ సందర్భంగా

-హాట్ స్పాట్‌లలో ప్రత్యేక పారిశుధ్య పనులు
-ప్రేయర్ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన
-సీజనల్ వ్యాధుల నియంత్రణపై కలెక్టర్ సమీక్ష

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు అధికంగా గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో వచ్చే అవకాశం

మిగతా 2లో..

# కౌలు రైతు కష్టాలు..!

(మొదటిపేజీ తరువాయి)

ఆవేదనపై ప్రజాపక్షం అందిస్తున్న ప్రత్యేక కథనం.... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా కౌలు రైతులకు భరోసా లేకుండా పోయింది. ఈ సీజన్ నుంచి రైతులకు రైతు భరోసా, కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను వర్తింపజేస్తూ కౌలు రైతుల గురించి ప్రభుత్వం ఊసెత్తక పోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. ఏడాదిన్నర క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే కౌలు రైతులకు సైతం రైతు భరోసా పథకాన్ని వర్తింపజేసి ఎకరానికి 7,500 చొప్పున ఏడాదికి రూ.15 వేలు అందజేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. కౌలు రైతులను ప్రభుత్వాలు విస్మరించినట్లే కనిపిస్తోంది. సొంత భూమి ఉండదు, బ్యాంకుకు వెళితే రూపాయి రుణం పుట్టదు. కుటుంబం గడవాలంటే తెలిసింది వ్యవసాయం ఒకటే. అప్పో, సప్పు చేసి భూములను కౌలుకు తీసుకుంటున్నారు. సాగులో ఎన్ని ఆటంకాలు వచ్చినా, నష్టాలు ఎదురైనా భరిస్తున్నారు. సరైన దిగుబడి రాక, వచ్చిన మద్దతు ధర అందక అప్పుల పాలవుతున్నారు. అయినా సర్కారు నుంచి వీరికి ఎలాంటి సాయం అందని పరిస్థితి. దీంతో కౌలు రైతులు, రైతు కూలీలు తీవ్రఇబ్బందులకు గురయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా కౌలు రైతులకు భరోసా కల్పించినప్పటికీ, ఇప్పటి వరకు సాయాన్ని అందించే విషయమై ప్రభుత్వం ఏడాదిన్నర గడిచినా పట్టించుకోకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. గడిచిన యాసంగి సీజన్ నుంచి రైతు భరోసా పథకాన్ని ఆరంభించింది. ఎకరానికి 7,500 రూపాయలకు బదులు 6 వేలు ఇచ్చింది. రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరిట పథకాన్ని ఆరంభించి వారి ఖాతాల్లో సీజన్‌కు రూ.6 వేల చొప్పున ఏడాదికి రూ.12 వేలు జమ చేస్తామని ప్రకటించింది. ఈ పథకం కింద 202324లో 20 రోజులు ఉపాధి పని దినాలకు వెళ్లిన వారై ఉండి, ఎలాంటి భూములు లేని వారికి మాత్రమే రైతు భరోసా అందిస్తానని చెప్పిన సర్కారు అయితే కౌలు రైతులను విస్మరించడంతో వాళ్లు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గడిచిన సీజన్‌లో రైతులు పండించిన సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇచ్చింది. దీంతో సన్న రకాలు పండించిన కౌలు రైతులకు కాస్త ఊరట లభించినప్పటికీ, ప్రభుత్వం సన్న రకాలకు బోనస్ ఇస్తుండడంతో ఈ సీజన్‌లో పట్టాదారులు కౌలు ధరలను పెంచారు. ఇప్పటి వరకు అన్ని రకాల నీటి వసతి ఉండి వరి సాగయ్యే భూములకు రెక్కలొచ్చాయి. మరి కొందరు పట్టాదారులు సన్న వరి పండిస్తే దాని కింద వచ్చే బోనస్‌లో సగం ఇస్తేనే కౌలు కొనసాగిస్తామని, లేదంటే కౌలు రద్దు చేస్తామని హెచ్చరించడంతో చేసేదేమి లేక పినపాక మండల వ్యాప్తంగా కొంత మంది కౌలు రైతులు ధరలను పెంచారు. కౌలు రైతులు ఆరుగాలం శ్రమించి చెమటోడ్చి పంటలు పండించినా కష్టం అంతా కౌలు కింద పట్టాదారులకే చెల్లించాల్సి వస్తుందని వాపోతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినా, తెగుళ్ల వచ్చి పంటలు దెబ్బతిన్నా పట్టాదారులకు కౌలు చెల్లించాల్సిందే. మండల వ్యాప్తంగా కొన్ని చోట్ల ముందుగానే కౌలు సొమ్ము చెల్లించిన వారికే పట్టాదారులు భూములను కౌలుకు ఇస్తున్నారు. విత్తనాలు, ఎరువుల ధరలతో పాటు ట్రాక్టర్లతో దున్నడం, హార్వేస్టర్ కిరాయి, కలుపు తీత, వరినాట్లు వేసేందుకు కూలీ ధరలు పెరగడంతో పెట్టుబడులు అధికమయ్యాయి. పంట నష్టపోతే ప్రభుత్వం ఇచ్చే పరిహారం పట్టాదారులకే ఇస్తారు. బ్యాంకులో పంట రుణాలు, ఇతరత్రా సబ్సిడీ పథ కాలు వారికే వర్తింపజేస్తున్నారు. దీంతో కౌలు రైతు లకు చెమట చుక్కలు తప్ప ఏమీ మిగలడం లేదు. అప్పుల పాలైతున్నామని పలువురు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ నిలబెట్టుకునేందుకు తమకు కూడా ఇదే సీజన్ నుంచి రైతు భరోసా అందజేయాలని పలువురు కౌలు రైతన్నలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు

**కౌలు రైతులను ఆదుకోవాలి : పద్మనాభ రాజు**

**సిపిఐ మండల కార్యదర్శి**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కౌలు రైతులకు కూడా రైతు భరోసా అందించాలి. అలాగే ఇతరత్రా ప్రోత్సాహకాలు వర్తింపజేయాలి. ఏటా కౌలు రేటు పెరుగుతుండడం, మరోవైపు దిగుబడి లేక మద్దతు ధర అందక కౌలు రైతులు అప్పుల పాలవుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు చేపట్టి వారిని ఆదుకోవాలి.

# సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

ఉండని వీటి నియంత్రణకు ప్రణాళిక ప్రకారం పనిచేయాలన్నారు. సీజనల్ వ్యాధులు అవగాహన లేకుండా ఉండడం వల్ల, సరైన పారిశుధ్యం లేని ప్రాంతాల్లో అధికంగా వస్తుంటాయని, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ మన పరిసరాలను మనం శుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులను పూర్తి స్థాయిలో నియంత్రించగలమన్నారు. చికిత్స కంటే నివారణ ఎంతో మేలని కలెక్టర్ తెలిపారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం వల్ల డయేరియా అధికంగా వస్తుందని ఇది పిల్లలకు తొందరగా అటాక్ అవుతుందన్నారు. ప్రతి పిహెచ్‌సి సబ్ సెంటర్ల వద్ద అవసరానికి మించి 10శాతం బఫర్ స్టాక్‌తో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో పెట్టాలన్నారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి రోజు ఉదయం ప్రేయర్ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో దీనిపై చర్చ పెట్టాలన్నారు. గత సంవత్సరం అధికంగా కేసులు నమోదైన ప్రాంతాలను హాట్ స్పాట్‌లుగా ఎంపిక చేసి అక్కడ ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాల వద్ద ఎటువంటి సీజనల్ వ్యాధుల వ్యాప్తి జరగకుండా స్పెషల్ శానిటేషన్ బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు స్టాక్ ఎప్పటికప్పుడు పరిశీలించాలని తక్కువ ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. డెంగ్యూ వైరస్ శాంపిల్స్ టెస్టింగ్ విస్తృతంగా చేయాలన్నారు. లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఆసుపత్రిలో టెస్టింగ్ చేయాలని ఏరియా ఆసుపత్రి, పిహెచ్‌సిల వద్ద అవసరమైన కిట్లు అందుబాటులో పెట్టుకోవాలన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, కార్పోరేషన్‌లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు ప్రతి వారం వర్షాకాలం ముగిసే వరకు చేయాలన్నారు. ప్రతి శుక్రవారం ఇంటింటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించాలన్నారు. ఇండ్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు సీజనల్ వ్యాధులు గతేడాది కంటే ఇప్పటికి ఎంత తగ్గించామనే అంశంపై మన పనితీరు ఆధారపడి ఉంటుందన్నారు. అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మూడు రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఏడు, ఎనిమిదవ తరగతి పిల్లలతో సంక్షేమ హాస్టళ్లలో ఫుడ్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.ఈ సమావేశంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, డిఆర్‌డివో సన్యాసయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ బి. కళావతిబాయి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా యుద్ధోన్మాదాన్ని ఖండించండి : తమ్మినేని



ప్రజాపక్షం/వైరా: సామ్రాజ్యవాద ఆధిపత్యం కోసమే అమెరికా ఇరాన్‌పై దాడులకు పాల్పడుతుందని అమెరికా దాడులు అంతర్జాతీయంగా ఉద్రిక్తలను పెంచి పెంచుతాయని పశ్చిమాసియా దేశాలను అస్థిరపరుస్తాయని, యుద్ధాలు వలన ప్రపంచ దేశాల్లో తీవ్రమైన ఆర్థిక సమస్యలు ఏర్పడతాయని, దీనివలన భారతదేశం కూడా తీవ్రంగా నష్టపయే అవకాశం ఉందని సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. సోమవారం వైరా పట్టణంలోని మిట్టపల్లి ఫంక్షన్ హాల్ నందు సిపిఐ(ఎం) వైరా పట్టణ, కొణిజర్ల మండలాల పార్టీ సభ్యుల రాజకీయ శిక్షణా తరగతులు తమ్మినేని వీరభద్రం ప్రారంభించారు. ఇరాన్ అను ఆయుధాలను తయారు చేస్తుందన్న ఎలాంటి ఆధారం లేదని, అంతర్జాతీయ అను శక్తి సంస్థ(ఐఎఈఏ) డైరెక్టర్ జనరల్ రాఫెల్ గ్రాస్సి, అమెరికా ఇంటిలిజెన్స్ సంస్థలు తెలిపినా ప్రపంచంపై ఆధిపత్యం చెలాయించడం కోసం అమెరికా నిన్నటి వరకు ఒక పథకం ప్రకారం ఇరాన్‌పై ఇజ్రాయిల్‌తో దాడులు చేయించి ఇప్పుడు అమెరికా కూడా ఇజ్రాయిల్‌తో చేతులు కలిపి దాడులు జరుగుతుందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం మోదీ ఇరాన్‌పై ఇజ్రాయిల్ అమెరికా దాడులు పైపన తమ వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పలువురు సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

# అమీర్ మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు : కూనంనేని



ప్రజాపక్షం/కారేపల్లి: అమీర్ మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన సిపిఐ నాయకులు ఎస్‌కె అమీర్ జమాల్‌పల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈవిషయం తెలుసుకున్న ఆయన అమీర్ భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబాన్ని ఓదార్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమీర్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని, అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. అమీర్ నిబద్ధత గల కార్యకర్తని క్రమ శిక్షణ కలిగి పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశాడని కొనియాడారు. అదే విధంగా భాగ్యనగర్ తండాకు చెందిన పార్టీ సీనియర్ నాయకులు గుగులోతు మాంగో ఇదే రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడని తెలుసుకొని ఫోన్లో ఆయన కుటుంబ సభ్యుల్ని పరామర్శించి, ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకుని భరోసా కల్పించారు. ఆయన వెంట సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎర్రబాబు, కే సారయ్య, ఏపూరి లతాదేవి, శివరామకృష్ణ, సిపిఐ నాయకులు బంధం నాగయ్య, ఉంగరాల సుధాకర్, పాపినేని సత్యనారాయణ, పుచ్చకాయల శ్రీనివాసరావు, బట్టు సంగయ్య, దల్సింగ్, పుచ్చకాయలపల్లి శాఖ కార్యదర్శి అమరు, సహాయ కార్యదర్శి రెడ్డిబోయిన రవి, తదితరులు పలువురు సిపిఐ కార్యకర్తలు సానుభూతిపరులు భౌతిక గాయాలన్ని సందర్శించి సంతాపం తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల కోసం రోడ్డెక్కిన నిరుపేదలు

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించగా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయమేర్పడింది. ఈసందర్భంగా బిఆర్ఎస్, సిపిఎం పార్టీ నాయకులు మాట్లాడుతూ తిరుమలాయపాలెం మండలంలో సుమారు 729 ఇండ్లు మంజూరు కాగా పైలెట్ ప్రాజెక్టు కింద ఏలూరుగూడెం గ్రామానికి సుమారు 39ఇండ్లు మంజూరయ్యాయని, మండల పరిధిలోని 40 గ్రామపంచాయతీల్లో ఏ ఒక్క గ్రామంలో అర్హులకు ఇండ్లు రాలేదని ఆరోపించారు. గ్రామంలో సుమారు 55ఇండ్లు మంజూరు కాగా దానిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు, కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపిన ప్రజా పంథా నాయకులకు ఇల్లు కేటాయించారని, ఇందిరమ్మ కమిటీలను రద్దు చేసి అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తిరుమలాయపాలెం ఎంపిడిఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తమకు ఇల్లు కేటాయించాలని అధికారులను నిలదీశారు. పిండిప్రోలు, తదితర గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీ వారు నిరుపేదలు కాకుండా సంపన్నులకు భూములు ట్రాక్టర్లు కార్లు, ఇండ్లు ఉన్న వారికి ఇండ్లు కేటాయించారని వెంటనే రీ సర్వే చేసి అర్హులైన పేదలకు ఇండ్లు కేటాయించాలని ఎంపిడిఓ సిలార్‌సాహెబ్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు చామకూరి రాజు, సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, చల్ల వెంకటేశ్వర్లు, పప్పుల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ షాపు డీలర్లతో

# తహసీల్దార్ సమీక్ష సమావేశం

**-రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కి తరలిస్తే కఠిన చర్యలు**

**-లబ్ధిదారులతో వేలిముద్ర వేయించుకొని డబ్బులు ఇస్తే సహించేది లేదు**

**-రేషన్ బియ్యం తరలింపుపై కలెక్టర్ సీరియస్**







ప్రజాపక్షం/వైరా: ప్రజాపంపిణీ బియ్యం పక్కదారి పడుతూ ఉంది. దళారులు డీలర్ల మిల్లర్లతో కుమ్మక్కై తరలిస్తున్నారనే కథనాన్ని ప్రజాపక్షం దినపత్రికలో వరుసగా ప్రచురించడం జరిగింది. ఈ కథనంతో స్పందించిన సివిల్ సప్లై, రెవిన్యూ అధికారులు తనిఖీలు కూడా నిర్వయించారు. సోమవారం వైరా తహశీల్దార్ శ్రీనివాసరావు మండలంలోని డీలర్లను పిలిపించి తహశీల్దార్ కార్యాలయం నందు సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి రేషన్ షాపు నుండి బియ్యం ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు చేరాలి. లబ్ధిదారులు రేషన్ కార్డులు నుంచి వేలిముద్రలు వేయించుకొని డబ్బులు ఇచ్చి బియ్యం ఉంచుకోవడం, దళారులకు బియ్యం అమ్మడం, మిల్లర్లతో కుమ్మక్కు కావడం లాంటివి జరిగితే సహించేది లేదని, ఇప్పటికే రేషన్ షాపుల నిర్వాహణపై జిల్లా కలెక్టర్ సీరియస్‌గా ఉన్నారని, ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా బియ్యాన్ని విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. ప్రతి రేషన్ షాపు వద్ద నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు రేషన్ ఇవ్వాలి. అలాకాకుండా రేషన్ ఇవ్వకుండా వేలిముద్ర వేసుకొని డబ్బులు ఇచ్చి పంపిస్తున్న విషయం తెలిస్తే సహించేది లేదన్నారు. కొంతమంది డీలర్లు దళారులు డీలర్ షాపులు పదే పెట్టుకొని పంపిస్తున్న విషయం మా దృష్టికి వస్తుందని, అలాంటివి మరల పునరావృతం అయితే సహించేది లేదని శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీకాంత్, విక్రమ్ పాల్గొన్నారు.

# అర్జీలను వెంటనే పరిష్కరించాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఖమ్మం నగరం పంపింగ్ వెల్ రోడ్డు గ్రెయిన్ మార్కెట్ ప్రాంతానికి చెందిన కొప్పు ప్రభావతి, కొప్పు పద్మావతి, కొప్పు సంపత్ కుమార్ లు తమ ముగ్గురికి 30వ డివిజన్‌లో సర్వే నెం. 135, 136లో 4,716 గజాల స్థలం ఉందని ఇందులో 616 గజాలు నగర పాలక సంస్థ అక్రమించి పార్కు కట్టారని తమ భూమి తమకు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. చింతకాని గ్రామానికి చెందిన పి. జగన్నాథం తాను నిరుపేద దివ్యాంగుడినని తనకు సదరం సర్టిఫికెట్ మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. ఖమ్మం రూరల్ మండలం చింతపల్లి గ్రామానికి చెందిన సిహెచ్ రామారావు సర్వే నెం. 220లో 2.27 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని దీనిని కాలువ ఎలైన్‌మెంట్ కోసం సేకరణ చేశారని, మారిన ఎలైన్‌మెంట్ ప్రకారం 1.20 ఎకరాలు మాత్రమే సేకరించారని, సేకరించిన భూమిలో 1.07 ఎకరాల భూమి మిగిలి ఉందని తిరిగి దానిని తనకు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. కొణిజర్ల మండలం బొట్లకుంట గ్రామానికి చెందిన గుర్రం అమృతమ్మ తన భర్తకు అంగవైకల్యం ఉందని తాము చాలా పేదరికంలో ఉన్నామని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. సంబంధిత దరఖాస్తులు పరిశీలించిన కలెక్టర్ సత్వరమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, డిఆర్‌డివో సన్యాసయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో సిహెచ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# నూతన పెన్షన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

**-పెన్షనర్ల జేఏసి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి**




**ప్రజాపక్షం/ఖమ్మం :** లక్షలాది మంది పెన్షనర్ల భవిష్యత్తుకు తూట్లు పొడుస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన పెన్షనర్ల చట్టాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని పెన్షనర్ల జేఏసి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కృషి భవన్‌లో పరిశ పుల్లయ్య అధ్యక్షతన జరిగిన పెన్షనర్ల జేఏసి సమావేశంలో మాట్లాడిన పలువురు వక్తలు పెన్షనర్లకు కేంద్ర చట్టం ద్వారా పెను ప్రమాదం పొంచి ఉందన్నారు. దానిని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు ఐక్యంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం పెన్షనర్ల సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని ఆర్థిక, ఆర్థికేతర అంశాలను వీలైనంత తొందరగా పరిష్కరించాలని కోరారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వ పింఛన్ దారుల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో డిమాండ్స్‌తో కూడిన విజ్ఞాపన పత్రాన్ని కలెక్టర్ అనుదీప్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్‌రావు, ఎస్. రంగారావు, రాయల రవి కుమార్, కొర్లపాటి బాబు, జే. వెంకటేశ్వర్లు, లక్ష్మి సుజాత, మేరీ ఏసుపాదం, అంజలి, భాస్కరాచారి, శరత్‌బాబు, గుర్రాల శ్రీనివాసరావు, ప్రసాదరావు, వీరభద్రరావు, పెద్దమళ్ల సత్యం, వెంకటేశ్వర్లు, రామనాథం, అల్లిక నర్సయ్య, ఆర్.రాధాకృష్ణమూర్తి, వివి అప్పారావు పాల్గొన్నారు.

# పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి : సిపిఐ




**ప్రజాపక్షం/ఖమ్మం :** నగరంలో సొంత ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని సిపిఐ నగర కార్యదర్శి కార్యదర్శి ఎస్‌కె జానిమియా డిమాండ్ చేశారు. జీవనోపాధి కోసం నగరానికి వచ్చిన పేద, మధ్యతరగతి ప్రజలు నివాస స్థలాలు లేక, ఉండేందుకు ఇండ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. సిపిఐ ఖమ్మం వన్‌టౌన్ ఏరియా సమావేశం వన్‌టౌన్ సిపిఐ కార్యాలయంలో సాధు నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జానిమియా మాట్లాడుతూ చాలా సంవత్సరాలుగా పట్టణంలో ఉన్న పేదలకు నివాస స్థలాల పంపిణీ జరగలేదని పేదలందరికీ నివాస స్థలాలు పంపిణీ చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శాఖ మహాసభలను పూర్తి చేసుకోవడం జరిగిందని వన్‌టౌన్, త్రీటౌన్, హవేలీ ఏరియా మహాసభలను పూర్తి చేసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. నగర మహాసభలో పార్టీ పోరాట కార్యాచరణను రూపొందించుకుని అందుకు అనుగుణంగా పని చేయడం జరుగుతుందన్నారు. శత వసంతాల ముగింపు సభ ఖమ్మంలో జరుగుతుందని వందేళ్ల పోరాట కార్యక్రమాన్ని సమీక్షించుకుని నేటి తరానికి పార్టీ కార్యక్రమాన్ని వివరించడం జరుగుతుందని జానిమియా తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, వన్‌టౌన్ ఏరియా కార్యదర్శి వరదా నర్సింహారావు, వన్‌టౌన్ ఏరియా నాయకులు మాల కొండయ్య, మాదుగుల నాగేశ్వరరావు, సిద్ది శ్రీను, సామ్యూల్, భూపాల్ రెడ్డి, రవి, నాగమణి, శీలం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# సన్నవడ్లకు బోనస్ విడుదల చేయాలి



**ప్రజాపక్షం/ బోనకల్ :** సన్నవడ్లకు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.500 బోనస్ విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం మధిర డివిజన్ కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని రైతు వేదిక నందు ప్రజాపాలనలో మండల తహశీల్దార్ మద్దెల రమాదేవికి సోమవారం వినతిపత్రం అందచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సన్న వడ్లకు రూ.500 ఇస్తామని ప్రకటించారని, నెలలు గడుస్తున్నా రైతులకు నేటికి ఇవ్వకపోవటం రైతులను మోసం చేయటమేనన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందని, ఆ హామీ కూడా నేటి వరకు అమలు చేయడం లేదన్నారు. ఈ సంవత్సరం రైతులు వ్యవసాయం ప్రారంభించి పత్తి పంటను సాగు చేశారన్నారు. రైతులందరికీ రైతు భరోసా వేయకుండా ఎకరాల పేరుతో దశలవారీగా వేస్తామని కాలయాపన చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని అన్నారు. అధికారంలోకి రాకముందే అభివృద్ధి కోసం పనిచేస్తామని ప్రకటనలు చేస్తారే తప్పా ఆచరణలోకి వచ్చే సరికి అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రతి సంవత్సరం అన్నదాతలు ఏదో ఒక పేరుతో ఆర్థికంగా నష్టపోతూనే ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలన్నింటిని వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులను సమీకరించి ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం డివిజన్ నాయకులు కిలారు సురేష్, రైతు సంఘం నాయకులు పారుపల్లి పూర్ణచంద్రరావు, మందడపు రామారావు, గుగులోతు నరేష్, సాదం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# సంధ్యపై దాడిని ఖండించండి

**-ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ**

**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సంధ్యపై జరిగిన దాడిని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ) తీవ్రంగా ఖండించింది. సోమవారం ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ ఖమ్మంజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోటు కళావతి, ఏపూరి లతాదేవి ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌లోని అమెరికన్ కన్సోలేట్ ముందు వామపక్షాల ఆందోళన సందర్భంగా పోలీసులు అతిగా ప్రవర్తించారని ఆందోళనకారులను నెట్టివేస్తూ దాడికి తెగబడ్డారన్నారు. ఈ తోపులాటలో సంధ్య కాలుకు తీవ్ర గాయమైందని పోలీసుల కారణంగానే ఇది జరిగిందని వారు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి విచారణ జరిపించాలని కళావతి, లతాదేవి లు డిమాండ్ చేశారు. అమెరికా యుద్ధ కాంక్ష కారణంగా పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని క్రూడాయిల్ ధరలు పెరగడంతో మిగిలిన నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరగనున్నాయన్నారు. ఇరాన్‌పై దాడిని అమెరికా తక్షణం నిలుపుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

# రహదారి మరమ్మతులు తక్షణమే చేపట్టాలి



**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ వైరా మధిర ప్రధాన రహదారికి తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని రైతువేదికలో జరిగిన ప్రజావాణిలో ప్రత్యేక అధికారులను సోమవారం కలిసి పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. వైరా మధిర ప్రధాన రహదారిపై బోనకల్ క్రాస్ రోడ్డు, రాపల్లి స్టేజ్, బ్రాహ్మణపల్లి, కలకోటల వద్ద రోడ్డు అధ్వాన్నంగా ఉండడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రోడ్డుపై పెద్ద గుంటలు పడడంతో అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లో రోగులను మధిర, ఖమ్మం ప్రాంతాలకు చేర్చడానికి ప్రయాసాలు పడాల్సి వస్తుందన్నారు. రోడ్డు దెబ్బతిని గుంటలపడ్డ ప్రదేశాల్లో వర్షపు నీరు చేరి ప్రమాదంగా మారాయని అన్నారు. ఇప్పటికైనా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క దృష్టి సారించి రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమం మండల సమితి సభ్యులు కొంగర భాస్కర్‌రావు, గుంపుల జయరాజు, జి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక పాఠశాలలకు హెచ్‌ఎం పోస్టులను కేటాయించాలి



**ప్రజాపక్షం/ బోనకల్ :** ప్రాథమిక పాఠశాలలకు హెచ్‌ఎం పోస్టులను కేటాయించాలని టిఎస్ యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం బోనకల్ మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో సభ్యత్వం, జనరల్ ఫండ్ క్యాంపియన్ నిర్వ హించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్రాథమిక పాఠశాలలకు పిఎస్ హెచ్‌ఎం పోస్టులు కేటాయించాలని, బదిలీలు, ప్రమోషన్లను చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను మంజూరు చేయాలని, ప్రాథమిక పాఠశాలల్లో ఎల్కేజి తరగతులు ప్రారంభించేందుకు అనుమతులు ఇవ్వాలని తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు సద్దా బాబు, మండల అధ్యక్షులు చిన్న రంగారావు, మండల ఉపాధ్యక్షులు పి.గోపాలరావు, కోశాధికారి కోటయ్య, మండల కార్యదర్శులు కె.సురేష్, పి.నర్సింహారావు, నారాయణ, నిర్మల, కేశవరావు, హరికృష్ణ, రామారావు, వి.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

# తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడి మృతి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ప్రమాదవశాత్తూ తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన ఖమ్మంరూరల్ మండలంలోని కామంచికల్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బాల నాగన్న(41) ప్రతిరోజు లాగానే సోమవారం ఉదయం 8గంటల సమయంలో పాటి వెంటేశ్వరరావు పొలంలో ఉన్నతాటిచెట్టు ఎక్కినాడు. ఈ క్రమంలో చెట్టుపై నుంచి జారిపడి తలకు, కుడికాలుకి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కాగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్టుగా తెలిపారు. భార్య బాల నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దార్యప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# నేడు రైతు వేదికల్లో విజయోత్సవాలు

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా రఘునాథపాలెం మండల పరిధిలోని రైతు వేదికల్లో మంగళవారం విజయోత్సవాలను నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వర రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రఘునాథపాలెం మండల పరిధిలో 15,612 మంది రైతులకు రైతుభరోసా పథకం క్రింద రూ.19.02 కోట్లు నగదును రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. రాంక్యాతండా, రఘునాథపాలెం, వి. వెంకటాయపాలెం రైతు వేదికల్లో రైతుభరోసా విజయోత్సవాలు మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ విజయోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంభాషిస్తారని తెలిపారు. మండలంలోని రైతులంతా తమ పరిధిలోని రైతు వేదికల్లో జరిగే విజయోత్సవంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన తెలిపారు.

# నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి



**-ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతి**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అనుమతి లేకుండా పాఠశాల నిర్వహిస్తూ అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు చట్టాన్ని ఉల్లంఘిస్తూ స్టేషనరీ పేరుతో బుక్ స్టోర్‌ను ఏర్పాటు చేసిన నారాయణ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ వారం రోజుల క్రితం నారాయణ పాఠశాలలోని స్టేషనరీ గోడౌన్‌ను విద్యాశాఖాధికారులు సీజ్ చేశారని అయినా దోడ్డిదారిన బుక్స్ విక్రయాలు కొనసాగిస్తున్నారన్నారు. నారాయణ పాఠశాలకు ప్రైమరీ సెక్షన్‌కు అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారన్నారు. అనుమతి లేకపోయినా అధిక ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాశాఖాధికారులు మాత్రం ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రామకృష్ణ ఆరోపించారు. ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో ఉంచాలని, విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, కార్పోరేట్ విద్యా సంస్థల్లో పేద వర్గాల విద్యార్థులకు 25 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని ఇది ఏ పాఠశాలలోనూ అమలు జరగడం లేదన్నారు. జిల్లా కలెక్టర్ దృష్టి సారించి నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలను నిర్వహిస్తున్నా నారాయణ విద్యా సంస్థలతో పాటు అనుమతులు లేని ప్రైవేటు పాఠశాలలపై తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పవన్, గోపి, హరికృష్ణ, విజయ్, నరేందర్ పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల అమలుకు పెద్దపీట : జారే

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. అశ్వారావుపేట మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈసందర్భంగా ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం సిసి రోడ్లు, డ్రైనేజిలు, పాఠశాలల ప్రహరీ గోడలు, అంతర్గత రహదారుల విస్తరణ, గ్రామీణ విద్యుత్ సరఫరా, విద్యుత్ లైన్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదినారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, రైతు భరోసా ద్వారా రూ.12వేలు పెట్టుబడి సాయం, మహిళా శక్తివంటి ప్రత్యేక పథకాలు, సన్నరకం వరి ధాన్యానికి బస్తాకు రూ.500బోనస్ అందించడం, గ్యాస్ సబ్సిడి అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, విద్యార్థులకు మెరుగైన విద్య వంటి తదితర సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.అలాగే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందించడం అత్యవసర సర్జరీ కోసం ఎల్ఓసి రూపంలో ఉచిత ట్రీట్మెంట్ అందించడంలో రాష్ట్ర వ్యాప్తంగా ముందు వరుసలో ఉన్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్, పంచాయతీరాజ్ డిఇ శ్రీధర్, ఎఈ అక్షిత్, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ డి సలీం, ఎఇ సతీష్, మండల మాజీ అధ్యక్షులు తుమ్మా రాంబాబు, మండల నాయకులు జూపల్లి రమేష్, జూపల్లి ప్రమోద్, ఫణి, మిండ హరి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మధిర మున్సిపాలిటీలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/ మధిర :** మధిర మున్సిపాల్టీలోని ప్రజలకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు అన్నారు. సోమవారం స్థానిక బోడేపూడి భవనం నందు మధిర పట్టణ కమిటీ శాఖ కార్యదర్శులు, ముఖ్య కార్యకర్తల సమావేశం మండల ఫణీంద్రకుమారి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మధిర మున్సిపాల్టీలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడంలోను, మున్సిపాల్టీ పరిధిలో పేద ప్రజలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, రేషన్‌కార్డులు ఇవ్వటంలో ప్రస్తుత కాంగ్రెస్, గత టిఆర్ఎస్ ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని పేర్కొన్నారు. అభివృద్ధి అంటే కోట్ల రూపాయలతో రింగ్ రోడ్లు, డ్రైనేజిలు చేపట్టడం కాదని వాటికన్నా ముందు కనీస అవసరాలైన ఇండ్లు, ఇళ్ల స్థలాలు, విద్యా, వైద్యం, ఉపాధి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పేద ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు పర్చటంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. మధిర నియోజకవర్గంలో కమ్యూనిస్టు పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న కాలంలో మాత్రమే పేదలకు న్యాయం జరిగిందని, వారికి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. ఇప్పటికైనా ఉప ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్క మధిర మున్సిపాల్టీలో ప్రజల సమస్యలపై దృష్టిసారించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం ఎల్లవేళలా ముందుంటుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి పడకంటి మురళీ, జిల్లా కమిటీ సభ్యులు శీలం నర్సింహారావు, పాపినేని రామనర్సయ్య, పుచ్చకాయల కిషోర్, ఫాతిమా బేగం, నాయకులు పెంటి రామారావు, సిద్దావలి, తేలపోలు రాధాకృష్ణ, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య 3వ మహాసభను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/ఇల్లెందు:** తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) 3వ మహాసభను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షురాలు కమటం చంద్రకళ పిలుపునిచ్చారు. స్థానిక విఠల్‌రావుభవన్‌లో సోమవారం ఏర్పాటైన సంఘం సమావేశంలో మాట్లాడారు. మహిళలపై అలనాటి దురాచారాలు, మూఢవిశ్వాసాలు, సతీసహగమనం లాంటి వాటిని అరికట్టేందుకు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన మహిళాలోకాన్ని చైతన్యపరిచారన్నారు. నేడు మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారంటే అఖిలభారత మహిళాసమాఖ్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ఉద్యమ పోరాటాలే కారణమన్నారు. మహిళలపై నేటికీ జరుగుతున్న అత్యాచారాలు అరికట్టాలంటే మహిళలందరూ ఏకం కావాలని తెలిపారు. ఈనెల27న ఇల్లెందు ఏరియాలో జరగనున్న 3వ మహాసభకు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మహిళా నాయకురాళ్లు శ్రీలక్ష్మి, అలుగు సరిత, బంధం లక్ష్మి, అపర్ణ, లక్ష్మి, రాణి తదితరులు పాల్గొన్నారు.




# రైతుల ఖాతాల్లో రూ. 406.36 కోట్లు జమ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రైతుల ఖాతాల్లో ఇప్పటి వరకు రూ. 406.36 కోట్లు రైతు భరోసా నిధులు జమ చేశామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 3,53,794 మంది రైతుల ఖాతాల్లో రూ. 436, 84,65,365 జమ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 15 ఎకరాల వరకు ఉన్న 3,31,397 మంది రైతులకు రూ. 406,36,62,570 రైతు భరోసా వానా కాలం 2025 క్రింద రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

# డ్రోన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రస్తుత సమాజంలో డ్రోన్‌కు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని మహిళలకు డ్రోన్లపై శిక్షణ అందించనున్నట్లు, ఆసక్తి గల మహిళలు ఈనెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళా ప్రాంగణ అధికారి వెల్పుల విజేత సోమవారం తెలిపారు. పంటల సాగులో డ్రోన్లను వినియోగిస్తున్నారని ఆమె తెలిపారు. పొలంలో విత్తనాలు వేయుటకు, పురుగు మందు పిచికారి చేయుటకు నేటి ఆధునీక సమాజంలో డ్రోన్ పరికరాలను విరివిగా వినూత్నంగా ఉపయోగిస్తున్నారన్నారు. పదవ తరగతి చదువుకున్న మహిళలకు డ్రోన్ శిక్షణ మహిళా ప్రాంగణంలో అందించనున్నట్లు ఆమె తెలిపారు. రాబోయే కాలంలో వ్యవసాయ, ఉద్యానవన తదితర శాఖల్లో ఉద్యోగ అవకాశాలు పొందేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో డ్వాక్రా గ్రూపులలో సభ్యులుగా ఉన్న మహిళలు ఈ శిక్షణ తీసుకుంటే వారికి శిక్షణతో పాటు డ్రోన్ పరికరాన్ని కూడా సబ్సిడీలో అందిస్తామని ఆమె తెలిపారు. ఆసక్తి ఉన్న పదవ తరగతి పూర్తి చేసిన మహిళలంతా మహిళా ప్రాంగణం టేకులపల్లి (ఖమ్మం) నందు ఈనెల 24 నుంచి 28 లోపు తమ దరఖాస్తులను అందించాలన్నారు.ఏమైనా సందేహాలు ఉంటే 7660022512 నెంబర్‌ను సంప్రదించాలని ఆమె తెలిపారు.

# రాజమండ్రి కూలీలకు పాత బట్టలు పంపిణీ



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** ప్రముఖ సామాజిక సేవకుడు, హెల్త్ అసిస్టెంట్ లంకా కొండయ్య ఆధ్వర్యంలో రాజమండ్రి నుండి మధిరలో కాలువల పూడికలు తీయటానికి వచ్చిన కూలీలకు మహాత్మాగాంధీ ఓల్డ్ క్లాత్ బ్యాంక్ ద్వారా సేకరించిన పాత బట్టలను సోమవారం పంపిణీ చేయటం జరిగింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు కర్నాటి రామారావు , షేక్ జహంగీర్, మైలవరపు చక్రి చేతుల మీదుగా ఈ పంపిణీ కార్యక్రమం జరుగగా వారు మాట్లాడుతూ మధిర పట్టణంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎయిడ్స్, కరోనాపై ప్రజలకు అవగాహన కల్పించి ఎన్నో అవార్డులు అందుకున్న లంకా కొండయ్య సేవలను కొనియాడారు. లంకా కొండయ్య పాత బట్టలకు సేకరించి నిరుపేదలకు అందచేయటం అభినందనీయమని అన్నారు. భవిష్యత్‌లో కూడా లంకా కొండయ్య ఇలాంటి మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.

# భారత ప్రధానికి పెన్షనర్ల మహా విజ్ఞాపన పత్రం




**ప్రజాపక్షం/వైరా:** కేంద్ర ప్రభుత్వం పెన్షన్ రూల్స్‌లో కొన్ని మార్పులు చేస్తూ 01.01.2026కు పూర్వ రిటైర్ అయిన పెన్షనర్లకు డిఏ, బెనిఫిట్స్ వర్తించకుండా చట్టం చేసింది. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ అఖిల భారత రాష్ట్ర పెన్షనర్స్ ఫెడరేషన్ ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు, మండల తహశబుల్దార్ కార్యాలయాల ముందు నిరసన తెలియజేస్తూ వారి ద్వారా భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీకి మహా విజ్ఞాపన పత్రం సమర్పించే కార్యక్రమాల్లో భాగంగా సోమవారం వైరా మండల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం పక్షాన వైరా తహశీల్దార్‌కి మహా విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్యసూరి, జగన్నాధరావు, వాసుదాసు, వలిజాన్, పెంటయ్య, సుబ్బయ్య, ప్రసాద్, చల్లా కృష్ణారావు, సామినేని వెంకటేశ్వరరావు, కొంగర నాగేశ్వరరావు, జివి.కృష్ణారావు, అరుణ, శారద, పిచ్చిరెడ్డి, భోగేశ్వరరావు, పురుషోత్తం, కృష్ణంరాజు, సిహెచ్.కృష్ణారావు, షేక్ బాజి, రామకృష్ణ, షేక్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి పాలనలోనే దేశాభివృద్ధి సాధ్యం



**ప్రజాపక్షం / మధిర :** దేశ ప్రధాని మోడీ నేతృత్వంలోని బిజెపి పాలనలోనే దేశాభివృద్ధి సాధ్యమని బిజెపి నాయకులు అన్నారు. సోమవారం బిజెపి ఆధ్వర్యంలో బలిదాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక బిజెపి కార్యాలయంలో మొక్కలను నాటారు. అనంతరం శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మధిర రూరల్, టౌన్ అధ్యక్షులు గడ్డం శ్రీహరిచౌదరి, శివరాజు సుమంత్, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి రామిశెట్టి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు కుంచం కృష్ణారావు, మర్సకట్ల స్వర్ణాకర్, పాపట్ల రమేష్, రామకృష్ణ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను కలిసిన నల్లమల



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షులు, తెలంగాణ అగ్రి, హార్టికల్చర్ సొసైటీ సలహాదారు నల్లమల వెంకటేశ్వరరావు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో సాగు వివరాలు, వాతావరణ పరిస్థితులు తదితర విషయాలను కలెక్టర్‌కు వివరించారు. పంటల సాగుకు సంబంధించి సమగ్ర సమాచారంతో కూడిన పుస్తకాన్ని నల్లమల కలెక్టర్‌కు బహూకరించారు.

# భూ సేకరణ ప్రణాళికాబద్ధంగా చేపట్టాలి

**-భూ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి**
**-మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణంపై కలెక్టర్ సమీక్ష**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మున్నేరు నదికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రణాళికాబద్ధంగా చేపట్టి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల, భూసేకరణ పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. గతేడాది వచ్చిన వరద మున్నేరు నదికి ఇరువైపులా నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల పురోగతి, రిటైనింగ్ వాల్ కొరకు భూ సేకరణ, భూ నిర్వాసితులకు ఇచ్చే ప్రభుత్వ స్థలం వివరాలను అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్నేరు నదికి ఇరువైపులా ఎనిమిదిన్నర కిలో మీటర్ల చొప్పున మొత్తం 17 కిలో మీటర్లు రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టాల్సి ఉందని వీటి కోసం మొత్తం 245 ఎకరాల భూమి అవసరమని ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్న భూమిలో ఐదు కిలో మీటర్ల మేర పనులు జరుగుతున్నాయన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన 138 ఎకరాల పట్టాభూమి సేకరణ చేయాలని నిర్ణయించామన్నారు. పోలేపల్లి రెవెన్యూ గ్రామంలో అందుబాటులో ఉన్న నాగార్జున సాగర్ ప్రాజెక్టు 300 ఎకరాల ప్రభుత్వ భూమిలో కొంత అభివృద్ధి చేసి పరిహారంగా అందించేలా స్థానిక రైతులను ఒప్పించాలన్నారు. మున్నేరు నదికి ఇరువైపులా సేకరించాల్సిన పట్టాభూముల రైతులతో పలుమార్లు చర్చించి 70 ఎకరాల వరకు ఒప్పించామని అధికారులు తెలిపారు. పోలేపల్లి రెవెన్యూ గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిలో వెంచర్, 100 ఫీట్ రోడ్డు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేసిన భూమిని పట్టాదారులకు అప్పగించాల్సి ఉంటుందన్నారు. పోలేపల్లి ఏరియాను ముందు గ్రౌండ్ లెవలింగ్ పనులు, 100 ఫీట్ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పోలేపల్లి గ్రామంలో ఆర్ అండ్ ఆర్ కాలనీ లాగా అంతర్గత రోడ్లు, స్కూల్స్, త్రాగునీటి సరఫరా విద్యుత్ సరఫరా వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రతి వారం పనుల పురోగతి నిర్దేశిత లక్ష్యాలను పెట్టుకోవాలన్నారు. ప్రకాష్ నగర్ చెక్‌డ్యాం బ్యాక్ వాటర్ కారణంగా ముంపు పెరుగుతుందని, దానిని తొలగించడానికి ప్రతిపాదనలు పంపామని అధికారులు తెలిపారు. అనంతరం సీతారామ ఎత్తిపోతల పథకం డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణ పనులకు, సింగరేణి, జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ చర్చించి పలు సూచనలు చేశారు. భూ సేకరణ ఎంజాయ్‌మెంట్ సర్వే వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు నర్సింహారావు, రాజేందర్ గౌడ్, నేషనల్ హైవే పిడి రామాంజనేయ రెడ్డి, మేనేజర్ దివ్య, ఇరిగేషన్ డిఈ రమేష్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్మిక మహాసభను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జులై నాలుగున కొణిజర్లలో జరిగే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘ ఖమ్మంజిల్లా 26వ మహాసభను జయప్రదం చేయాలని ఖమ్మంజిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక దొండపాటి భవన్‌లో పిట్టల రాంబాబు అధ్యక్షతన జరిగిన మహాసభల ఆహ్వాన సంఘ సమావేశంలో తాటి వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. బిజెపి మోడీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాటి నుండి వ్యవసాయ కార్మిక హక్కులను కాలరాస్తూ పాలన సాగిస్తుందన్నారు. కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా మోడీ కార్మిక చట్టాలను రద్దు చేస్తున్నారని ఆయన తెలిపారు. వ్యవసాయ కార్మికులు తమ హక్కులను కాపాడుకునేందుకు సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. అనేక పోరాటాలతో వెట్టిచాకిరి విముక్తి, ఉపాధి హామీ పథకాన్ని సాధించుకున్న ఘనత వ్యవసాయ కార్మిక సంఘానిదే నన్నారు. ఈ మహాసభలలో వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు కార్యాచరణ రూపకల్పన చేయనున్నట్లు




ఆయన తెలిపారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, జిల్లా నాయకులు పివి రావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కంపసాటి వెంకన్న, పిట్టల రాంబాబు, రైతు సంఘం నాయకులు సోమయ్య, ఆహ్వాన సంఘం అధ్యక్షులు తోటపల్లి సీతారాములు , ప్రధాన కార్యదర్శి స్వర్ణ రమేష్, చింతల మల్లయ్య, బండారం వెంకన్న, వెంకటేశ్వర్లు నాయుడు, వెంకన్న, కె. ప్రసాద్, రాములు, నాగేశ్వరరావు, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

# రైతన్న మోములో చిగురించిన ఆశలు..!

**ప్రజాపక్షం/పెనుబల్లిః** శనివారం రాత్రి, ఆదివారం ఒక మోస్తారు వర్షం కురిసింది. పెనుబల్లి మండల రైతాంగ అశలు చిగురించాయి. సహజం గా జూన్ నెల చివరలో రైతులు సాగు పనులు మొదలు పెడతారు. అందులో భాగంగా పత్తి, మిర్చి సాగు రైతులు రైతులు దుక్కి దున్ని విత్తనాలు నాటారు. జూన్ నెల ప్రవేశించి 15 రోజులు దాటుతున్న వర్షాలు కురవక పోవడంతో రైతన్నలు ఆందోళన చెందారు. వరి పొలాల్లో వరి సాగు రైతులు నార్లు పోసి వర్షం కోసం ఆకాశవైపు చూశారు. పెట్టిన పెట్టుబడి నష్టపోయి మరలా వ్యవసాయ పనులకు పెట్టుబడి పెట్టవలసిన పరిస్థితి ఏర్పడి ఆర్థిక భారం మోయవలసి వస్తుందేమోనని దిగులు చెందుతున్న తరుణంలో శనివారం రాత్రి, ఆదివారం కురిసిన ఓ మోస్తారు వర్షం ప్రస్తుతానికి అన్నదాతలకు ఊరట లభించింది. వాతావరణం వర్షాలు కురిసే అవకాశం ఉందని రైతు ఆశ పడు



తున్నాడు. కాలం సరిగ్గా చూసి రైతు పెట్టుకున్న ఆశలు అడియాసలే కాకుండా వర్షాలు మెండుగా కురుస్తాయని ఆశించి రైతన్నలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

# మత్తు పదార్ధాలకు బానిసై జీవితాలను పాడుచేసుకోవద్దు : ఎస్సై

**ప్రజాపక్షం/వైరాః** విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనుకాకుండా చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని వైరా ఎస్సై పి.రామారావు అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మత్తు పదార్ధాల వ్యతిరేక అవగాహన వారోత్సవాల్లో భాగంగా హీల్ యువర్ మైండ్ అండ్ ప్లాంట్ ట్రీ సే నో టు డ్రగ్స్ అనే నినాదంతో గురువారం పోలీస్‌స్టేషన్ బ్రాహ్మణపల్లి ప్రాథమిక పాఠశాలలో గంజాయి మత్తు పదార్ధాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన, పిల్లలతో మొక్కలు నాటే కార్యక్యరమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రామారావు విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే విద్యార్థులు



ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని లక్ష్య సాధన దిశగా అడుగు వేయాలని, విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని, మత్తు పదార్థాలైన గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు తీసుకుంటే భవిష్యత్తు అంధకారం అవుతుందని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలకు చేరుకొని తల్లిదండ్రులకు గురువులకు మంచి పేరు తేవాలని సూచించారు. మీ కాలనీ, మీచుట్టు ప్రక్కల ప్రాంతంలో ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లయితే పోలీస్ దృష్టికి తీసుకురావాలన్నారు. సమాచారం అందించిన వివరణ గోప్యంగా ఉంచబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, టీచర్స్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతు సదస్సుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రైతు సదస్సులు వీక్షించడానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసాలో భాగంగా రాష్ట్రంలో వ్యవసాయ యోగ్యమైన అన్ని భూములకు రైతు భరోసా రూ.9000 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలో జమైనట్లు 58 రైతు వేదికలలో రైతు సదస్సుల సందర్భంగా పండుగ వాతవరణాన్ని కల్పించాలన్నారు. నాలుగు గంటలకే రైతు వేదిక వద్దకు రైతులు చేరుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆడియో, వీడియోలో ఎటువంటి సాంకేతిక లోపం లేకుండా సరి చూసుకోవాలన్నారు. మహిళా రైతులు కూడా తరలివచ్చేలా చూడాలన్నారు. హాజరైన రైతుల వివరాలు ప్రత్యేకంగా నమోదు చేయాలన్నారు.




# ప్రజావాణిలో పాల్గొన్న కమిషనర్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తుదారుల సమస్యలు ఏమిటో అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు అప్పగించారు. బుర్హాన్‌పురంకు చెందిన సుజాత పాత కాలువ డ్యామేజ్ అయి నీరు పోవడానికి ఇబ్బందిగా ఉందని మరమ్మతులు చేయాలని దరఖాస్తు చేశారు. పుట్టకోటకు చెందిన బి. వెంకటరెడ్డి తమ ఇంటికి రెండు వాటర్ పన్నులు వస్తున్నాయని వాటిని పరిష్కరించాలని దరఖాస్తు చేశారు. నగర పరిధిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సంబంధిత అధికారులకు వెంటనే పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు.



### పలు డివిజన్లలో గ్యాంగ్ వర్క్...

100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని 15, 31, 39, 55 డివిజన్లలో 20 మంది వర్కర్లతో గ్యాంగ్ వర్క్ ఏర్పాటు చేసి పారిశుధ్య పనులు చేపట్టారు. మ్యానువల్‌గా కాని వారిని జేసిబిలను ఉపయోగించి కాలువను శుభ్రం చేశారు. బుష్ కటింగ్, ఓపెన్ ప్లాట్లు క్లినింగ్ చేపట్టారు. ట్రాక్టర్ల ద్వారా చెత్తను తొలగించారు. హార్టికల్చర్ ఆఫీసర్ గొల్లగూడెం ఈద్గా పార్కును సందర్శించి పార్కు నిర్వహణను పరిశీలించారు. మొక్కల సంరక్షణ తనిఖీ చేశారు. 54వ డివిజన్‌లో నిర్మాణంలో ఉన్న పార్కును, 46వ డివిజన్‌లో నిర్మాణంలో ఉన్న సిసి డ్రైన్లను డిప్యూటీ ఈఈ పరిశీలించారు. కమర్షియల్ ఏరియాలో రోడ్ల పక్కన, డివైడర్ల పక్కన ప్రాంతాల్లో జటాయు వాహనం ద్వారా చెత్తను తొలగించారు.

# గిరిజన యువత అన్ని రంగాల్లో ముందుండాలి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గిరిజన యువత అన్ని రంగాల్లో ముందుండేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తుందని అడిషనల్ ఎస్పి నరేందర్ అన్నారు. ఇందులో భాగంగా గుండాల మండలంలోని 100 మంది యువకులకు డ్రైవింగ్ లైసెన్సులు ఆయన తన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందంర్భంగా మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో నివశించే యువతకు పోలీస్ శాఖ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. క్రీడాపోటీలు నిర్వహిండంతో పాటు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంత యువత కొందరు మద్యానికి బానిసలై వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలు విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. ఏజెన్సీలోని అన్ని పిఎస్‌ల పరిధిలోని యువతకు డ్రైవింగ్ లైసెన్సులు ఇప్పించడం జరుగుతుందన్నారు. అనంతరం యువత సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. లైసెన్సులు ఇచ్చేందుకు కృషి చేసిన గుండాల సిఐ రవీంధర్, కానిస్టేబుల్ శంకర్ ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు డిఎస్‌పి ఎన్ చంద్రభాను, ఎస్ఐ రవూఫ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించాలి

**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీలో కమీషనర్ చింతా వేణు అధ్యక్షతన మెప్మా ఆర్‌పిలు, సిఎల్ఎఫ్ ఈసి సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎస్ఎల్ఎఫ్, డ్వాక్రా సంఘాల పనితీరు, బ్యాంక్ లికంఏజి, స్త్రీనిధి వసూలు, ఇందిరా మహిళా శక్తి యూనిట్స్, స్ట్రీట్ వెండర్స్ గ్రూపుల ఏర్పాటు, ప్రతినెల ఎస్ఎల్ఎఫ్ పరిధిలోని ఎస్‌హెచ్‌జి మీటింగ్ పెట్టాలని అట్టి మీటింగ్‌లో ప్రభుత్వ పథకాలు, రాబోవు వర్షాకాలం సీజన్‌లో పరిసరాల పరిశుభ్రత డ్రైడే కార్యక్రమాలు వార్డులు వారీగా చేయాలని కమీషనర్ చింతా వేణు తెలిపారు. మెప్మా జిల్లా కోఆర్డినేటర్ సుజాత మాట్లాడుతూ పంచ సూత్రాల గురించి చెప్పడం జరిగింది. దీనిలో ఎస్‌హెచ్‌జిలు, ప్రతి నెల పొదుపులు, మీటింగ్ పుస్తకాలు తీసుకోవడం, అంతర్గత అప్పులు తీసుకోవడం, సక్రమంగా తిరిగి వసూలు చేసుకోవడం గురించి చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో మెప్మా టిఎంసి బండారుపల్లి వెంకటేశ్వర్లు, ఆర్‌పిలు సిఎల్ఎఫ్, ఈసి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



# వీరభద్రంని పరామర్శించిన తమ్మినేని

**ప్రజాపక్షం/వైరాః** రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రంని వైరాలో తన నివాసంలో పరామర్శించిన సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఖమ్మం మాజీ ఎంపి తమ్మినేని వీరభద్రం రోడ్డు ప్రమాదం జరిగిన సంఘటన అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోల్కోవాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్, వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, పట్టణ నాయకుడు కొంగర సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

